

బ్రహ్మోత్సవ పనులు

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పనులు టీటీడీ ప్రారంభించింది. విద్యుద్దీపాలంకరణ పనులకు శ్రీకారం చుట్టింది.



రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అధికారులకు పిలుపునిచ్చారు.

- 8లో



అక్రమ అరెస్టులతో..

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే చింతల ధ్వజమెత్తారు.

- 8లో

న్యూస్‌రీల్

27న ఫుట్‌బాల్ సెలెక్షన్స్

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27వ తేదీన జిల్లా స్థాయి మెన్ ఫుట్‌బాల్ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు జిల్లా ఫుట్‌బాల్ సంఘ నేతలు హేమంత్‌రెడ్డి, కిశోర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు రిజిస్ట్రేషన్ల కోసం 8712139311 నంబరుకు ఫోన్ చేయాలని వారు సూచించారు.

స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని సాయుధ దళం కార్యాలయ మైదానంలో 100 మీటర్ల స్లో మోటార్ సైకిల్ రైడింగ్ నిర్వహించనున్నట్టు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. ఆసక్తి గల వారు శనివారం సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులుంటాయన్నారు. 18 సంవత్సరాలు నిండి డ్రైవింగ్ లైసెన్స్, పెండింగ్ చలానాలు ఉండని వ్యక్తులు అర్హులని ఆయన పేర్కొన్నారు.

27న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో ఈనెల 27న జిల్లా స్థాయిలో నిర్వహించే యోగాసన పోటీలను అర్హులు, ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుక్తాచౌదరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో గెలుపొందే మొదటి బహుమతి విజేత రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 6303899780, 9985407782 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంజినీరింగ్ తొలి విడత అడ్మిషన్లు ప్రారంభం

- సోమవారం నుంచి రెండో విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ



ఓ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ల కోసం విచ్చేసిన విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎట్టకేలకు ఇంజినీరింగ్ తొలి విడత అడ్మిషన్ల జాబితా బుధవారం విడుదల కావడంతో ఇంజినీరింగ్ కళాశాలలు కోలాహలం నెలకొంది. తొలి విడత సీట్లు సాధించిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో గురువారం రిపోర్ట్ చేసి అడ్మిషన్లు పొందారు. దీంతో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, డీమ్డ్, అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలు విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారాయి. తొలిరోజు 56 శాతం మేర విద్యార్థులకు అడ్మిషన్లు పొందినట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 27వ తేదీ వరకు తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది. అలాగే రెండో విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం.



మహిళకు వైద్యపరీక్షలు (ఫైల్)

ఆపదలో అమ్మ!

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముంచుకొస్తోంది. అవగాహన లోపంతో మహిళలను ముప్పుతిప్పలు పెడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కేసుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ఈ వ్యాధి ఎక్కువగా పేద, మధ్య తరగతికి చెందిన అబలలనే బలితీసుకుంటోంది. ఉచిత టీకాల విషయంపై ఎవరూ నోరెత్తకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జిల్లాలో పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)

- సర్వేలో వెలుగుచూస్తున్న కేసులు
- కొందరు క్యాన్సర్‌ను దాచిపెడుతున్న వైనం
- ఈ వ్యాధి నివారణకు అవగాహన కల్పిస్తే ఒట్టు
- ఉచిత వ్యాక్సిన్ ఊసెత్తని ప్రభుత్వాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇటీవల సిబ్బంది ఎన్‌సీడీ సర్వే చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 5,92,514 కుటుంబాలు ఉండగా 5,03,311 కుటుంబాలను సర్వే చేశారు. ఈ సర్వేలో కొంత మేర సర్వైకల్ క్యాన్సర్ కేసులు బయటపడ్డాయి. 18 ఏళ్లు దాటిన వారు 15,67,268 మంది ఉంటే 11,24,511 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఇందులో 273 మందికి ఓరల్ క్యాన్సర్, 218 మందికి రొమ్ము క్యాన్సర్, 203 మందికి సర్వైకల్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. ఇక అవగాహన రాహిత్యంతో సర్వైకల్ క్యాన్సర్‌ను గుర్తించలేకపోతున్నారు. ఇలాంటి వారు వివిధ కారణాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించడంతో కేసులు బయటపడుతున్నాయి.

వ్యాధి లక్షణాలు

- రుతుక్రమంలో సమస్యలు
- యోని నుంచి రక్తస్రావం
- లైంగిక సంపర్కం తర్వాత రక్తస్రావం
- పీరియడ్స్ ఆగిపోయిన తర్వాత రక్తస్రావం
- యోని నుంచి దుర్వాసన, రక్తంతో కూడిన గడ్డలు రావడం
- మూత్రం, మల విసర్జనలో ఆటంకాలు
- పొత్తికడుపులో నొప్పి, బరువు తగ్గడం, నీరసం, విరేచనాలు, కాళ్లవాపు వంటి సమస్యలు



సర్వైకల్ క్యాన్సర్ వ్యాప్తి ఇలా...

సర్వైకల్ క్యాన్సర్ సోకడానికి ప్రధాన కారణం 'హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ)'. ఎక్కు వ మంది భాగస్వాములతో శృగారంలో పాల్గొనడం వల్ల ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇది కొన్నేళ్ల తర్వాత వృద్ధి చెంది క్యాన్సర్‌కు కారణమవుతుంది. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ రోగుల్లో, కొన్ని రకాల మందులు తరచూ వాడడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది. తద్వారా కూడా సర్వైకల్ క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. చిన్న వయసులో శృంగారంలో పాల్గొనడం వల్ల హెచ్‌పీవీ ఇన్ఫెక్షన్ సోకే ముప్పు ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. అందుకే బాల్య వివాహాలు చేసుకునే వారిలో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు స్పష్టం చేస్తున్నారు. గర్భనిరోధక మాత్రలు ఏళ్ల తరబడి వాడినా సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. నెలసరి సమయంలో సరైన వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం కూడా ఈ క్యాన్సర్ ముప్పును పెంచుతుంది. వీటితో పాటు ధూమపానం, అనారోగ్యకరమైన జీవనశైలి, వంశపారంపర్యంగా కూడా కొంతమందిలో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి ఈ కేసులు అత్యధికంగా పేద కుటుంబాల్లోని మహిళల్లోనే వెలుగుచూస్తున్నాయి.

వ్యాక్సినేషన్ మాటేమిటో?

ఈ వ్యాధి బారిన పడకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో ఒకటి వ్యాక్సినేషన్. ప్రస్తుతం 9–26 ఏళ్ల వారికి ఈ టీకా అందుబాటులో ఉంది. అటు కేంద్రం కూడా దీనిపై దృష్టి సారించింది. 19–14 ఏళ్ల లోపు బాలికలు సర్వైకల్ క్యాన్సర్‌బారిన పడకుండా వ్యాక్సినేషన్‌ను పోత్సహిస్తామని ప్రకటించింది. దీని ధర మార్కెట్లో రూ.2వేల వరకు ఉన్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. విడతల వారీగా ఈ వ్యాక్సినేషన్‌ను వేయించుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఈ వ్యాక్సిన్ వేయించుకునే స్థోమత పేద, మధ్యతరగతి కుటుంబాల్లో లేదు. ఈ కారణంగా ప్రభుత్వమే వ్యాక్సిన్‌ను మహిళలకు ఉచితంగా అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు క్షేత్ర స్థాయిలో సర్వైకల్ క్యాన్సర్‌పై సరైనా అవగాహన కల్పించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ఈ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే క్యాన్సర్ నివారణ తొలి దశలోనే గుర్తించొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



స్క్రీనింగ్ పరీక్షలకొచ్చిన పింక్ బస్

వ్యాక్సిన్ ఉంది



గంటకు దేశంలో 9 మంది సర్వైకల్ క్యాన్సర్‌తో చనిపోతున్నారు. ఇప్పటి వరకు 80వేల మంది మరణించారు. కొత్త కేసులు 1.70 లక్షలు ఉన్నాయి. ఇలానే వదిలేస్తే ఇంకా కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అన్ని క్యాన్సర్లకంటే..ఈ సర్వైకల్ క్యాన్సర్ నివారణకు మాత్రమే వ్యాక్సిన్ ఉంది. ఈ క్యాన్సర్ నివారణకు ఏళ్ల లోపు పిల్లలకు 90శాతం వ్యాక్సినేషన్ పూర్తయి ఉండాలి. 35–45 సంవత్సరాల లోపు మహిళలకు 70 శాతం స్క్రీనింగ్ పరీక్షలు అయి ఉండాలి. బాధితులు కచ్చితంగా మెరుగైన వైద్యం చేయించుకోవాలి. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వల్ల 80శాతం కేసులను నివారించవచ్చు.

– ఆశ్రిత, వైద్య నిపుణులు

గ్రామాల్లోనే అధికం



గ్రామాల్లోనే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ క్యాన్సర్‌ను పాప్ స్మియర్ టెస్టు ద్వారా ముందే గుర్తించే అవకాశం ఉంది. తద్వారా మరణాలను కూడా గణనీయంగా తగ్గించవచ్చు. ఈ ముప్పును తప్పించుకోవాలంటే మన శరీరంపై అవగాహన ఉండాలి. ఏ మాత్రం మార్పు కనిపించినా దాన్ని గుర్తించాలి. శరీరంలో నొప్పి లేని గడ్డలు ఏమి కనిపించినా నిర్లక్ష్యం చేయొద్దు. తక్షణం వైద్యులను సంప్రదించాలి.

– ఉషశ్రీ, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి, చిత్తూరు

ముందే గుర్తిస్తే మేలు



సర్వైకల్ క్యాన్సర్ దాచిపెడితే ప్రాణానికే ప్రమాదం. ఇందులో దాపరికాలు వద్దు. లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. పరీక్షలు చేయించాలి. నిర్ధారణ అయితే సరైనా చికిత్స తీసుకోవాలి. బయపడాల్సి పనిలేదు. దీనికి తోడు కౌమార దశలో బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఈ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– సుధారాణి, డీఎంఅండ్ హెచ్‌ఓ, చిత్తూరు

ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలి

– పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి



పార్లమెంటులో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ఎంఎస్ఎంఈలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. ఆయన పార్లమెంటులో తిరుపతి జిల్లా నుంచి ఏవైనా ఎంఎస్ఎంఈ యూనిట్లను గుర్తించారా? అలాగే ఎగుమతిదారులకు ఆర్థిక మద్దతు, క్రాస్–బోర్డర్ ఫ్యాక్టరింగ్, విదేశీ మార్కెట్లలో నాన్–టారిఫ్ అడ్డంకులను అధిగమించడంలో సహాయం పొందారా..? అంటూ ఎంపీ ప్రశ్నించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి గురువారం ఆయన పార్లమెంటులో కీలక ప్రశ్నను లేవనెత్తారు. కేంద్ర బడ్జెట్ 2025–26లో ప్రకటించిన ఎగుమతుల ప్రోత్సాహం మిషన్ అమలులో భాగంగా ఎగుమతుల ప్రోత్సాహ మిషన్‌ను వాణిజ్య, ఎంఎస్ఎంఈ, ఆర్థిక శాఖలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయని, వాణిజ్య విభాగం ప్రధాన నోడల్ శాఖగా పనిచేస్తోందని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఎంపీ గురుమూర్తి ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు ఆర్థిక సంవత్సరాలలో ఈ పథకం కింద 7 ఎంఎస్ఎంఈలకు రూ.16 లక్షల ఆర్థిక సహాయం అందిందని తెలిపారు. తిరుపతి వంటి అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి పట్టణాలు, ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలోని ఎంఎస్ఎంఈలకు సమాన అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ మద్దిల గురుమూర్తి సభలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు ఆర్థిక సంవత్సరాలలో కేవలం 7 ఎంఎస్ఎంఈ సంస్థలకు రూ. 16 లక్షల ఆర్థిక సాయం మాత్రమే అందించడం శోచనీయమని ఎంపీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈ లను ప్రోత్సహిస్తే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎంపీ డిమాండ్ చేశారు.

ఉన్నత విద్య బలోపేతానికి కృషి



పీవీకేఎన్ కౌన్సెలింగ్ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : ఉన్నత విద్య బలోపేతానికి అధ్యాపకులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుల సర్వీస్ కొనసాగింపునకు ఆమె కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్వీస్ కొనసాగింపునకు అర్హత ఉన్న ఒప్పంద అధ్యాపకుల సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్వీస్‌లో కొనసాగింపు అవుతున్న ఒప్పంద అధ్యాపకులు డిగ్రీ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 50 మంది ఒప్పంద అధ్యాపకులను 2025–26 సంవత్సరానికి కొనసాగించే ప్రక్రియను చేపట్టారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, పలు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు మనోహర్, విజయేలురెడ్డి, వేణుగోపాల్, షణ్ముగం, చిదంబరం, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అక్రమ అరెస్టు.. కూటమి కుట్ర



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

శ్రీకాళహస్తి : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ శ్రీకాళహస్తి పట్టణం, గాలిగోపురం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ లబ్ధి కోసం అరెస్టు చేయడం దారుణమని, కూటమి కక్ష పూరిత రాజకీయాలు ఎల్లకాలం సాగవన్నారు. కూటమి అరాచకాలపై ప్రజలు తిరగబడే కాలం దగ్గర్లో ఉందన్నారు. ఉండవల్లి అరుణ్ కుమార్ మాటలను చంద్రబాబు గుర్తు చేసుకోవాలని రానున్న రోజుల్లో కూటమికి డిపాజిట్లు కూడా రావని తెలిపారు. ప్రశ్నిస్తానని వచ్చిన పవన్ కళ్యాణ్ ప్రజలను గాలికి వదిలేసి తన సినిమా రేట్లు పెంచుకొని దీని కోసమే రాజకీయాలకు వచ్చానని చెప్పడం చూస్తుంటే చాలా బాధేస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వస్తున్న జనాధరణను చూసి ఓర్వలేక అలాగే ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను డైవర్ట్ చేయడానికి కుట్ర పన్నుతున్నారని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరూ తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నాం వాసుదేవ నాయుడు, ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరీ కిషోర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, జయ శ్యామ్ రాయల్,కంఠ ఉదయ్ కుమార్,మస్తాన్, యువజన విభాగం అధ్యక్షులు, నేతలు , కార్యకర్తలు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే..

కేవీబీపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ కేవీబీపురం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి నూకతోటి రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అమలు చేయలేక వాటిని ప్రశ్నించిన ప్రతిపక్ష నేతలను అక్రమ కేసుల్లో జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు నీరుపోసి పెంచి పోషిస్తున్న కేసులే రేపటి రోజున వారిని చుట్టుముట్టి ఊపిరాడనీయకుండా చేస్తాయని హెచ్చరించారు. టీడీపీ కవ్వింపు చర్యల పట్ల వైసీపీ నేతలు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని రాజేష్ సూచించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు గవర్ల కృష్ణయ్య, ధనుంజయరెడ్డి, బొర్రా మాధవీరెడ్డి, లాల్‌బాబుయాదవ్, దశరథరామిరెడ్డి, చందురెడ్డి, నంద కుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీలు అయ్యప్పరెడ్డి, సర్పంచ్ గిరిబాబు, మైనారిటీ సెల్ నేతలు, బీసీ సెల్ నేతలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నూకతోటి రాజేష్ , పార్టీ శ్రేణులు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 80,130 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,786 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

వేదిక్ గణిత పుస్తకాల ఆవిష్కరణ

తిరుపతి సిటీ : విజయవాడ వేదికగా గురువారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆర్కే అబాకస్ వేదిక్ మ్యాథ్స్ 2.0 వర్షన్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఆర్కే విద్యా సంస్థల చైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ విమల ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పుస్తకం గణిత శాస్త్రంపై విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించి సులువుగా నేర్చుకునేందుకు ఉపయోగపడుతుందని వారు వెల్లడించారు. త్వరలో మరో 10వేల పుస్తకాలను ముద్రించి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలోని విద్యార్థులు సులువుగా, శీఘ్రంగా, ఉల్లాసంగా గణిత సూత్రాలను నేర్చుకునేందుకు మా వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య బీసీ జనరల్ సెక్రటరీ రెడ్డప్ప, నాగేంద్ర పాల్గొన్నారు.

సారా రహిత జిల్లానే లక్ష్యం



విజయశేఖర్, డిప్యూటీ కమిషనర్

కార్వేటినగరం: సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ స్పష్టం చేశారు. గురువారం కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషన్ మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలు, బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 14405 ద్వారా సమాచారం అందించాలన్నారు. సహకరించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సారా కేసుల్లో పట్టుబడి ఆ వృత్తిని విరమించుకుని జీవనం సాగించే వాళ్లకి పాడి ఆవులు, ఆటోలు లాంటివి అందించి ప్రత్యామ్నాయంగా సహాయం అందిస్తామన్నారు. వైన్‌షాప్ సమీపంలో పర్మిట్ రూములకు అనుమతులు లేవన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకిషోర్‌రెడ్డి, చిత్తూరు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, ఎస్ఐ శ్రావణకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోయకొండ ఉద్యోగులపై చీటింగ్ కేసు

చౌడేపల్లె: బోయకొండలో పెద్దభోగం మొక్కుబడి చెల్లింపు టికెట్లలో చేతివాటం చూపి అక్రమాలకు పాల్పడిన సిబ్బంది ఆరుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ ఘటనపై ఈఓ ఏకాంబరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టికెట్ల విక్రయాల్లో చేతివాటం చూపిన రెగ్యులర్ ఉద్యోగి నాగముని, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గంగరాజు, విజయ్‌కుమార్‌రెడ్డి, మునిశేఖర్, హరిప్రసాద్, సోమశేఖర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మొగిలి ఘాట్‌లో లారీ బోల్తా



మొగిలి ఘాట్‌లో అదుపుతప్పి బోల్తా పడ్డలారీ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం ఓ లారీ అదుపు తప్పి బోల్తాపడింది. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎవరికి చెప్పేది ‘భూ’బాధలు?

ఫ్రీహోల్డ్ భూములపై కూటమి కన్నెర్ర

- నిబంధనల మేరకున్న భూములుపైనా ఆంక్షలే
- లేఅవుట్లలో సైట్లను కొని ఇబ్బందులు పెడుతున్న వైనం
- అవసరానికి భూములు విక్రయించాలన్నా కుదరదు
- ప్రభుత్వం నుంచి త్వరలో ఆదేశాలంటున్న అధికారులు



ఫ్రీహోల్డ్ నిషేధిత జాబితాలోని భూమి

పలమనేరు: ఉన్న నాలుకకు మందేస్తే కొండనాలుక ఊడినట్టుంది భూముల రిజిస్ట్రేషన్లపై కూటమి ప్రభుత్వ తీరు. గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో ఎన్నో అక్రమాలున్నాయని, ఇందుకు సహకరించిన అధికారులపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే ఫ్రీహోల్డ్ భూములపై బ్యాన్ పెట్టింది. దీంతో నిషేధిత జాబితాలోని ఇంటి స్థలాలు, పొలాలు కూటమి రిజిస్ట్రేషన్లు లేకుండా పోయాయి. అయితే నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉన్నా ఈ బ్యాన్ కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామని చాలామంది బాధితులు ఆవేదన చెందుతున్నారు. వీటి రిజిస్ట్రేషన్లపై అనుమతులు ఇస్తామన్న ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

మదనపల్లి ఫైళ్ల దగ్ధం కేసు సాకు చూపి

మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అక్రమాలు జరిగాయని.. అందుకే ఫైళ్లను దగ్ధం చేశారనే సాకుతో కూటమి ప్రభుత్వం జిల్లాలో గతంలో ఫ్రీహోల్డ్ అయిన అన్ని భూములపై బ్యాన్ పెట్టింది. క్షేత్రస్థాయిలో సర్వే నంబర్ల వారీగా విచారణ లేకుండానే ఎన్నో అక్రమాలు జరిగాయంటూ ప్రాథమిక విచారణతోనే 1,05,409 ఎకరాలపై నిషేధం విధించింది. లేఅవట్లలో సైతం భారీ అక్రమాలు జరిగాయని చెబుతున్నారేగానీ అవి ఎలా సాగాయి.. ఇందులో నిజమెంతో సంబంధిత అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు.

మళ్లీ మొదటికే..!

కూటమి ప్రభుత్వం చెబుతున్నట్టు జిల్లాలో కేవలం 53,917 ఎకరాలను మాత్రమే రిజిస్ట్రేషన్లకు అనుమతులిస్తే మిగిలిన భూముల మాటేమిటో అర్థం కావడం లేదు. అసలు ఫ్రీహోల్డ్‌లో అక్రమాలు ఎలా జరిగాయో అధికారులు సైతం ఇంతవరకు చెప్పడం లేదు. ఎవరైనా సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే మీ భూమి నిషేధిత జాబితాలో ఉందని చెప్పి పంపేస్తున్నారు. గతంలో సక్రమంగా ఉన్నాయనే వీటిపై క్రయ, విక్రయాలు జరిగాయి. కోట్లాది రూపాయలు పెట్టి చాలా మంది ఈ భూములను కొనుగోలు చేశారు. ఇప్పుడు ఇవి రిజిస్టర్ కాకపోతే వారి పరిస్థితేంటి. మొత్తం భూములపై విచారణ జరిపి సవ్యంగా ఉన్న భూముల జాబితా ఇస్తామన్న అధికారులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి.



ఫ్రీహోల్డ్ నిషేధిత జాబితాలోని స్థలాలు

జిల్లా సమాచారం

ఫ్రీహోల్డ్ చేసిన మొత్తం భూములు :	1,59,327 ఎకరాలు
ఆక్రమణలు జరిగాయని ఆరోపణలున్న భూములు :	1,05,409 ఎకరాలు
సక్రమంగా ఉన్నాయని చెబుతున్న భూములు :	53,917 ఎకరాలు

మా పరిస్థితి ఏంటి?



రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫలానా సర్వే నంబరు రిజిస్ట్రేషన్ అవుతుందని చెబితేనే స్థలాలను కొన్నాం. ఇప్పుడు అన్ని సర్వే నంబర్లను బ్యాన్ చేస్తే మా పరిస్థితేంటి. అప్పోసప్పో చేసి జాగాలు కొని ఇబ్బందులు పడుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. విచారణల పేరిట ఇలా ఆలస్యం చేయడం కరెక్ట్ కాదు.

– హేమంత్‌కుమార్‌రెడ్డి, పలమనేరు

మరో రెండు నెలల్లో..



ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై మరో రెండు నెలలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావచ్చని భావిస్తున్నాం. ఆ మేరకు సక్రమ జాబితాలో ఉన్న భూములు, స్థలాలు తప్పకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఫ్రీహోల్డ్ భూముల సర్వే నంబర్లతో సహా ఆన్‌లైన్ అయ్యాక వాటిని అప్‌లోడ్ చేస్తారు.

– ఏ.వెంకటరమణమూర్తి, జిల్లా రిజిస్ట్రార్

ఆహార ఉత్పత్తుల పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ హోమ్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆహార ఉత్పత్తుల పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. వర్సిటీలోని సెనేట్ హాల్‌లో గురువారం ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్, డైటిక్స్ –ఫుడ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్ విభాగాలు సంయుక్తంగా అప్లికేషన్స్ ఆఫ్ టెక్చర్ అనాలిసిస్ ఇన్ ఫుడ్ సైన్స్ అన్న అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఇందులో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని వర్క్‌షాపును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో ఫుడ్ టెక్నాలజీ విభాగాన్ని, ఆహార ఉత్పత్తి పరిశ్రమలను అనుసంధానం చేస్తామన్నారు. యూఎస్‌లోని పూర్వడా వర్సిటీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, రాగిణి శర్మ మాట్లాడుతూ మానవ శారీరక నిర్మాణానికి అవసరమైన ఆహారం, నీరు, పోషకాల ప్రాధాన్యతను వివరించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి, ప్రొఫెసర్ మంజుల, కేవీ సుచరిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో భయపెట్టలేరు : చింతల

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని, అక్రమ అరెస్టులతో ఎవ్వరినీ భయపెట్టలేరని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వెల్లడించారు. గురువారం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి చేరుకున్న ఆయన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మిని పరామర్శించి ధైర్యం చెప్పారు. లిక్కర్ స్కాం కేసులో నెల రోజులుగా చెవిరెడ్డిని జైలులో బంధించడాన్ని ఆయన తప్పుబట్టారు. చెవిరెడ్డి, మిథున్‌రెడ్డి వంటి వ్యక్తులను జగనన్నకు దూరం చేయాలని కుట్రలు పన్నుతూ తప్పుడు కేసుల్లో ఇరికిస్తోందన్నారు.

రాజకీయ ఒత్తిడికి తలొగ్గొద్దు

- ఉద్యోగ ధర్మాన్ని విస్మరించొద్దు
- ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వండి
- బడిబయట పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి
- పలు శాఖల సమావేశాల్లో కలెక్టర్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : రాజకీయ ఒత్తిళ్లకు జిల్లా అధికారులు తలొగ్గొద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ, రక్షణ బాధ్యత ఆయా రెవెన్యూ అధికారులదేనన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ప్రజలను ఉద్దేశపూర్వకంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెవెన్యూ ఉద్యోగుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సేకరణలో అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు తన దృష్టికి వస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగరాదన్నారు. ఎక్కడైనా రెవెన్యూ ఉద్యోగులపై దాడులు జరిగినట్లు తన దృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీజీఆర్ఎస్‌లో పరిష్కరించే సమస్యలకు తప్పనిసరిగా ప్రజలకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్, ఆర్‌డీవోలు, పలు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

బడిబయట 4,447 మంది పిల్లలు

చిత్తూరు జిల్లాను బడిబయట పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన విద్యాశాఖ అధికారుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆ సదుపాయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 4,447 మంది బడిబయట పిల్లలున్నారని తెలిపారు. బడి మానేసిన ప్రతి విద్యార్థి ఇంటికి హెచ్‌ఎం వెళ్లి మాట్లాడాలన్నారు. విద్యార్థి పరిస్థితిని తెలుసుకుని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జిల్లాలోని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో వసతులు కల్పించి విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. సమావేశంలో డీఈవో వరలక్ష్మి, ఏపీసీ వెంకటరమణ, పలు మండలాల ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

- మృతదేహాన్ని చెరువు కట్టపై పడేసిన ముగ్గురు వ్యక్తులు
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



నిందుతుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఓ యువకుడు కరెంట్ షాక్‌తో మృతిచెందినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డీఎస్పీ డీఎస్పీ సాయినాథ్ కథనం.. చిత్తూరు మండలం, బీఎన్ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌లో గురువారం అనుమానాస్పద కేసుకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. యాదమరి మండలం, పట్టపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (25) ఆదివారం బీఎన్ఆర్‌పేట చెరువు కట్టపై శవమై కనిపించాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ విచారణలో గుడిపాల మండలంలోని మంచినీళ్లకుంట గ్రామానికి చెందిన మాధవి ఇంట్లో శనివారం రాత్రి కరెంట్ రాకపోవడంతో సరిచేసేందుకు వెంకటేష్ వెళ్లాడు. కరెంట్ తీగలు సరిచేసే క్రమంలో వెంకటేష్ ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

ఈ విషయాన్ని మాధవి తన తండ్రి రాజా, తమ్ముడు చందుకు చెప్పింది. వీరి సాయంతో మృతదేహాన్ని ద్విచక్ర వాహనంలో తీసుకొచ్చి బీఎన్ఆర్‌పేట చెరువు కట్టపై పడేసి వెళ్లిపోయారు. ఇది సీసీటీడీ ఫుటేజీ ద్వారా వెలుగుచూసింది. దీని ఆధారంగా కేసు విచారణను పూర్తిచేశామని, నిందితులు నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

నా భర్తను కాపాడండి



అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న వెంకటరమణ

పలమనేరు: అంతుచిక్కని వ్యాధితో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తన భర్తను కాపాడాలని పలమనేరు నియోజకవర్గంలోని, పెద్దపంజాణి మండలం, బట్టందొడ్డి పంచాయతీ గడ్డూరుకు చెందిన రేణుక అభ్యర్థించారు. ఈ మేరకు ఆమె గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తన భర్త వెంకటరమణ కూలినాలి చేసి కుటుంబాన్ని పోషించేవాడని తెలిపారు. ఏమైందోగానీ ఇటీవల ఆయన కడుపుపై చారలు ఏర్పడ్డాయని చెప్పారు. ఆపై కడుపు బెలూన్‌లా పెరిగిపోతోందన్నారు. పెద్దాస్పత్రుల్లో చూపించుకునే ఆర్థిక స్థోమత లేక అల్లాడుతున్నట్టు వాపోయారు. ఇద్దరు పిల్లల పోషణ, భర్తను ఆస్పత్రిలో చూపించడం కష్టతరమవుతోందని కన్నీటిపర్యంతమయ్యారు. కూటమి ప్రభుత్వం స్పందించి తన భర్తను కాపాడాలని కోరారు.





ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వెంకటరమణతో కుటుంబీకులు, ఆస్పత్రి రికార్డులు

ఆకట్టుకున్న దుర్యోధన వధ



యుద్ధంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం నిర్వహించిన దుర్యోధనవధ ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. భాగవతారణి జ్యోత్స్న మధ్యాహ్నం దుర్యోధన వధ హరికథను గానం చేశారు. వెంటటేశ్వర కళానాట్య మండలి ఆధ్వర్యంలో భీమ, దుర్యోధన పాత్రధారులు యుద్ధ ఘట్టాలను ప్రదర్శించారు. దుర్యోధనుడు మడుగులో దాక్కొని ఉండగా భీముడు అతన్ని బయటకు రప్పించి, శ్రీకృష్ణుని సాయంతో అంతమొందించిన ఘట్టాన్ని కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. వారు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. దుర్యోధనుడి ప్రతిమ మట్టికోసం భక్తులు ఎగబడ్డారు. అంతకుమునుపు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 18 రోజుల పాటు నిర్వహించిన మహాభారత యజ్ఞం ముగిసింది. కార్యక్రమంలో పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, కంకణధారులు బాబురెడ్డి, మల్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ సభ్యుడు భాస్కర్ రెడ్డి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం ఆపాలని ఆందోళన



ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నారాయణవనం : మండలంలోని తుంబూరు దళితవాడ ప్రాథమిక పాఠశాల విలీనాన్ని విరమించుకోవాలని పిల్లలతో కలిసి తల్లిదండ్రులు, ఏఎస్ఎఫ్ఐ నేతలు గురువారం తహసీల్దార్, మండల విద్యాధికారి కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగారు. ఊరి బడిలోనే పిల్లలు చదువుకునే వెసులుబాటును కల్పించాలని, పిల్లలను చదువుకు దూరం చేయొద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం డీటీ భానుప్రకాష్, ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వేర్వేరుగా వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్ కుమార్, మహేష్, తల్లిదండ్రులు మాట్లాడుతూ.. విలీనం పేరుతో పాఠశాలలను మూసివేయడం, డీ గ్రేడ్ చేయడం దారుణమన్నారు. తుంబూరు దళితవాడ పాఠశాలలో చదువుతున్న 56 మంది విద్యార్థులను పది మంది విద్యార్థులే ఉన్న పాఠశాలలో విలీనం చేయడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యాసాగర్, ఇందుమతి, సారా, భాగ్యరాజ్, గోవిందయ్య, ప్రసాద్, మునివేలు, కుప్పలు, చంద్రయ్య, రవి, రాము, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సర్కారు బడులు నిర్వీర్యం



మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం సర్కారు బడులను నిర్వీర్యం చేస్తోందని తిరుపతి మాజీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ధ్వజమెత్తారు. తిరుమల ఆలయంలోనే కాదు భారతదేశంలో ఏ ఆలయాల్లోనైనా, ఎక్కడైనా అన్యమతస్తులు ఉండవచ్చని వ్యాఖ్యానించారు. ఈ మేరకు గురువారం చిత్తూరు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. తిరుమలలో అన్యమతస్తులకు అనుమతి నిరాకరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యం తదితర అంశాలపై విమర్శలు గుప్పించారు. తిరుమల పుణ్యక్షేత్రంలో అన్యమతస్తులను అనుమతించకపోవడం దారుణమన్నారు. అదేక్రమంలో ప్రస్తుతం తిరుమల దేవస్థానంలో దళితులెవ్వరూ ఉద్యోగాలు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అన్యమతస్తులకు తిరుమలతో పాటు దేశంలోని అన్ని దేవాలయాల్లోకి ప్రవేశం కల్పించే అంశానికి సంబంధించి తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్య హాజరు తక్కువగా ఉందని సాకు చూపుతూ అనేక ప్రాథమిక పాఠశాలలను మూసి వేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో కూటమి నాయకులు భారీగా అవినీతికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. సంబంధిత అంశాలను రాష్ట్ర ప్రజలు సున్నితంగా గమనించాలని సూచించారు. టీడీపీ, బీజేపీ నాయకుల అవినీతి, అక్రమాలపై తాను పోరాటానికి సిద్ధమవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.